# హైదరాబాదు
# స్వాతంత్ర్య సంరంభం

పరిచయం, వివరణలు

**ఎన్. వేణుగోపాల్**

**ప్రాచీ పబ్లికేషన్స్**
హైదరాబాదు

# హైదరాబాదు
# స్వాతంత్ర్య సంరంభం

పరిచయం, వివరణలు

**ఎన్. వేణుగోపాల్**

ప్రాచీ పబ్లికేషన్స్
హైదరాబాదు

**Hyderabad Swatantrya Samrambham**

All Rights Reserved

Publication : December 2010

Price : ₹ 25/-

**ISBN : 978-81-7443-034-2**

*Published by* P.P.C. Joshi
for Prachee Publications
3-3-859/1/A, 2nd Floor, Lane opp. Arya Samaj,
Kachiguda, Hyderabad - 500 027.
Cell : 93466 89306, www.pracheepublications.com
e-mail : joshippc@yahoo.co.in, joshippc@gmail.com

*Type-setting :* Balaji Graphics
Gandhi Nagar, Hyderabad - 500 020.
Phone : 040-2760 7125

*Printed at :* Charita Impressions
1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020.

# చదివితీరవలసిన చరిత్రాత్మక దస్తావేజు

**- ఎన్. వేణుగోపాల్**

ఇది ఎప్పుడో 1938-39లో అచ్చయిన అరవై పేజీల చిన్నకరపత్రం. అప్పుడు ఉనికిలో ఉండిన హైదరాబాదు రాజ్యంలో ప్రజారాజకీయఉద్యమ నిర్మాణ ప్రక్రియలోని ఒక ఘట్టాన్ని వివరించే ఇరవైనాలుగు పేజీల ప్రధాన వ్యాసం, మరొక ముప్పైఆరు పేజీల ఏడు అనుబంధ రచనలు కలిపి ఈ కరపత్రం అచ్చయింది. ఇప్పుడు ఆ కాలమూ మారింది, ఆ స్థలమూ మారింది. ఆనాటి రాజకీయపరిస్థితులూ మారిపోయాయి. అప్పటి రాజకీయపాత్రధారులలో ఏ ఒక్కరూ ఈవేళ సజీవంగాలేరు. కాని ఈ కరపత్రపు ప్రాధాన్యత తగ్గిపోలేదు సరిగదా కొన్ని రంగాలలో పెరిగిందేమోనని కూడ అనిపిస్తుంది. చరిత్రలో తక్షణ, తాత్కాలిక అవసరాలకోసం వెలువడి, ఆ ప్రయోజనం నెరవేరగానే కాలగర్భంలో కలిసిపోయే అసంఖ్యాకమైన కరపత్రాలలా కాక ఈ కరపత్రంలో ఒక ప్రత్యేకత ఉంది. ఏడుపదులు నిండిన తర్వాత కూడ ఈ కరపత్రానికి చారిత్రక, సామాజిక, రాజకీయ ప్రాముఖ్యత ఉంది.

అందువల్లనే ప్రాచీ పబ్లికేషన్స్ పి.పి.సి. జోషి గారు దీన్ని మళ్లీ ప్రచురించి, ఈ తరానికి అందుబాటులోకి తేవాలని ఆలోచించారు. కాని ఈ పుస్తకంలో ఈ తరం పాఠకులకు తెలియనివీ, సులభంగా గ్రహించడానికి వీలులేనివీ కొన్ని విషయాలు ఉన్నాయి. అందువల్ల ఈ పుస్తక నేపథ్యాన్ని పరిచయం చేసే ముందుమాట, పుస్తకంలో ప్రస్తావనకు వచ్చిన మనుషులగురించీ, విషయాల గురించీ వివరణలు అవసరమని భావించి, అవి రాసేపని నాకు అప్పగించారు. ఈ ముందుమాట, వివరణల రచన గతంతో వర్తమానం జరుపుతున్న సంభాషణగా, తెలంగాణ వర్తమానంలో అపరిష్కృతంగా ఉండిపోయి, మళ్లీ మళ్లీ తలెత్తుతున్న సమస్యల మూలాల వెతుకులాటగా, భవిష్యత్తు తెలంగాణ గురించీ, ప్రజాఉద్యమాలగురించీ అవసరమైన సూచనగా భావించి ఈ పనికి అంగీకరించాను.  ఈ రకంగా హైదరాబాదురాజ్య చరిత్రలోని ఒక ఉజ్వల ఘట్టంగురించి ప్రస్తుత తెలంగాణ ఆలోచనాపరులతో కొన్ని విషయాలు పంచుకునే అవకాశం నాకు కలిగింది.

సామాజికవ్యవస్థలో నిరంకుశ రాచరిక భూస్వామ్యంగా ఉంటూనే, పెట్టుబడిదారీ వలసవాదపాలనకు 'విశ్వాసపాత్రమైన స్నేహాన్ని' అందించిన చిట్టచివరి ఆసఫ్ జాహీ పాలకుడు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కింద సాగిన హైదరాబాదురాజ్య చరిత్ర చాల విశిష్టమైనది. రాజధానిలో ఆధునికతను ప్రవేశపెడుతూ కూడా గ్రామసీమలలో మధ్యయుగాల దోపిడీపీడనలను వ్యవస్థీకరించిన పాలన అది. రాజ్యంలో అత్యధిక సంఖ్యాక ప్రజానీకం కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తుండగా, ఏలికా, మధ్యదళారీలూ మాత్రం నిత్యవైభోగాలలో ఓలలాడిన, ప్రపంచంలోని అత్యంత సంపన్నులతో తులతూగిన పాలన అది. ఒకవైపు బ్రిటిషువలసవాదులతో, మరొకవైపు వేలఎకరాల భూస్వాములతో, ఇంకొకవైపు మతతత్వరాజకీయాలతో సహజీవనం సాగించిన పాలన అది. మతరాజ్యంగా దానికి అపకీర్తి వచ్చిందిగాని నిజానికి పాలకుడి సొంత మతవిశ్వాసాలు ఏమయినప్పటికీ, ఆయనను ఆలంబనగా పెట్టుకున్న వలసవాదులు పైనా, భూస్వాములు కిందా పూర్తిగా భిన్నమతవిశ్వాసాలు గలవారే. ఒకవైపు పొరుగున ఉన్న బ్రిటిషు ఇండియాలో నామమాత్రంగానైనా ప్రారంభమైన ఆధునిక ప్రాతినిధ్య, ఎన్నికల రాజకీయాలకు అవసరమైన పాలనాసంస్కరణలను ప్రవేశపెడతానని వాగ్దానాలు చేస్తూనే మరొకవైపు కనీస వాక్సభాస్వాతంత్ర్యాలను కూడ  నిషేధించిన రాచరికం అది.

పాలకులవైపునుంచి చూసినపుడు ఇటువంటి వైచిత్రిని ప్రదర్శించిన హైదరాబాదురాజ్యం ప్రజలవైపునుంచి చూసినపుడు కూడ ఆశ్చర్యకరమైన దృశ్యాన్నే చూపుతుంది. అత్యంత దుర్భరమైన అణచివేతను అనుభవిస్తూ కూడ హైదరాబాదురాజ్యప్రజలు ఎప్పటికప్పుడు ప్రతిఘటననూ పోరాటస్ఫూర్తినీ ప్రకటిస్తూవచ్చారు. మరీ ముఖ్యంగా ఇరవయ్యోశతాబ్ది ప్రారంభంనుంచీకూడ ఈ ప్రతిఘటనాచైతన్యం అసంఖ్యాకమార్గాలలో ప్రవహించింది. దాదాపు అన్ని వర్గాలప్రజలు యథాస్థితిమీద తమ అసంతృప్తిని ప్రకటించడం, ప్రతిఘటించడం మాత్రమేకాదు, తమకు తోచినపద్ధతిలో ప్రత్యామ్నాయాల అన్వేషణ కూడ ప్రారంభించారు. ఈ ప్రత్యామ్నాయాల అన్వేషణలోని విస్తృతి, వైవిధ్యం హైదరాబాదురాజ్యప్రజల సృజనాత్మకతకూ, అద్భుతమైన నవ్యతకూ అద్దం పడతాయి. పది శాతానికి తక్కువ జనాభా అక్షరాస్యులైనచోట గ్రంథాలయాల స్థాపన ఒక ఉద్యమంగా సాగింది. తమ భాషాసాహిత్యాలకు సముచితగౌరవం కావాలని కోరుతూపుట్టిన మేధావుల, బుద్ధిజీవుల, అగ్రవర్ణాల సంస్థ అంతిమంగా నిరక్షరాస్యులనూ, సబ్బండ వర్ణాలనూ చేరి, సాయుధపోరాటంగా పర్యవసించింది. మాతృభాషలో మాట్లాడుకునే ఆకాంక్షతో, రాజుకు మహజర్లు సమర్పించుకునే పద్ధతిలో మొదలయిన విద్యావంతుల ఆందోళన, చివరికి సమాజాన్ని పట్టి



పీడిస్తున్న వెట్టిచాకిరీనీ, అసమభూసంబంధాలనూ రద్దుచేయదలచిన విమోచనోద్యమంగా మారింది. జాగీర్దార్లనుంచి దళితులవరకూ, ఆదివాసుల వరకూ అన్ని బృందాలప్రజలూ తమతమ ఆకాంక్షల సాధనకొరకు సంఘటిత మయ్యారు. దాదాపు ప్రతిసామాజిక, రాజకీయసంచలనమూ అన్నివర్గాల ఐక్యసంఘటననూ, ఒకేవర్గంలోని అన్ని బృందాల ఐక్యసంఘటననూ అద్భుతంగా సాధించింది.

ఇటువంటి అసాధారణ పరిణామాలెన్నో హైదరాబాదురాజ్యచరిత్రలో ఇరవయ్యో శతాబ్ది తొలిఅర్ధభాగంలో కనబడతాయి. హైదరాబాదుసమాజం సాగించిన ఈ వైవిధ్యభరితమైన అన్వేషణే డజన్లకొద్దీ ప్రజాసంస్థల నిర్మాణానికీ ఎదుగుదలకూ కూడ దారితీసింది. నిజంగానే 1901 నుంచి ఈ కరపత్రం అచ్చయిన 1938-39 వరకూ నాలుగు దశాబ్దాలలో ఏర్పడిన ప్రజాహితసంస్థల సంఖ్య నలభైకిపైనే ఉందంటే ఆ కాలపు హైదరాబాదు సామాజికజీవితం ఎంత గతిశీలంగా ఉండిందో అర్థం చేసుకోవచ్చు. అటువంటి అనేకప్రజాసంస్థలలో ఒకటి, స్పష్టంగా రాజకీయఅభినివేశాన్ని ప్రకటించుకుంటూపుట్టిన అతికొద్ది సంస్థలలో ఒకటి హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్.

ఛార్లెస్ డికెన్స్ "టేల్ ఆఫ్ టు సిటీస్" లో వర్ణించిన వైచిత్రినిమించిన ఆ వైరుధ్యభరితమైనసమాజంలో వికసించిన తొలిరాజకీయసంస్థగా స్టేట్ కాంగ్రెస్ ఆవిర్భావంలోనూ, నిర్మాణంలోనూ చెప్పుకోదగిన అంశాలెన్నో ఉన్నాయి. అయితే ఏ సామాజికపరిణామం కూడ శూన్యంలోంచి ఊడిపడదు. ఎన్నో పరిమాణాత్మక మార్పులు జరుగుతూ జరుగుతూ వచ్చి ఇటువంటి గుణాత్మకమార్పుకు దారితీస్తాయి. స్టేట్ కాంగ్రెస్ 1938లో రూపొందడానికి హైదరాబాదురాజ్యంలో కనీసం అంతకుముందు ఆరు ఏడు దశాబ్దాలుగా సాగుతూవచ్చిన సామాజిక పరిణామాల చరిత్ర ఉంది. అవి స్పష్టమైన రాజకీయరూపం తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. లేదా రాజకీయపరిణామాలు సాంస్కృతిక, సామాజిక, మత, విద్యా పరిణామాల వెనుక దాక్కుని ప్రచ్ఛన్నరూపంలో వచ్చిన సందర్భాలున్నాయి.

మధ్యయుగాల దక్కనుచరిత్రలోని అనేక ధిక్కారసంప్రదాయాల చరిత్ర అలా ఉంచినా, ఆధునికయుగంలో దాదాపుగా 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామకాలం నుంచే హైదరాబాదురాజ్యంలో ప్రగతిశీల భావాల, ఆచరణల చరిత్రను అధ్యయనం చేయడానికి ఆధారాలు ఉన్నాయి. హైదరాబాదు తమ పట్టునుంచి వెళ్లిపోతే భారత ఉపఖండాన్నే వదులుకోవలసి వస్తుందని బ్రిటిషు పాలకులు 1857లో చేసిన వ్యాఖ్యలు చరిత్రకెక్కాయి. హైదరాబాదు ప్రభువు, ఆయనకన్న ముఖ్యంగా ప్రధానమంత్రి మొదటి సాలార్ జంగ్ బ్రిటిషు ప్రభుత్వాన్ని

సమర్థించినప్పటికీ, హైదరాబాదురాజ్యప్రజలు, స్థానిక మతపెద్దలు, కొందరు సంస్థానాధిపతులు కూడ వలసపాలకులను వ్యతిరేకించే వైఖరి తీసుకున్నారు. ఇక్కడ కూడ ఒక వైచిత్రి ఉంది. తమలాగనే ఇస్లాము మతవిశ్వాసి అయిన బహదూర్ షా జఫర్ చక్రవర్తిత్వాన్ని సమర్థించే బదులు హైదరాబాదు పాలకులు బ్రిటిషు వలసవాదులకు మద్దతు తెలిపారు. కాని ప్రజలుమాత్రం ఇటు ముస్లింలయినా, అటు హిందువులయినా, బ్రిటిషు వలసవాదులను ఎదిరించి, రెసిడెన్సీమీద దాడిచేశారు. వీలయిన పద్ధతులలో పోరాటం చేపట్టారు.

అలా 1857లోనే మొదలైన, పాలకవర్గాలనూ, పాలకవిధానాలనూ వ్యతిరేకించే ఆలోచనాధోరణి 1883లో చాందా (చంద్రాపూర్) రైల్వేలైను పథకాన్ని వ్యతిరేకించే సమయంలో మరింతస్పష్టంగా కనబడింది. మొదటి సాలార్ జంగ్ తన మరణానికిముందే ఆమోదించిన ఈ చాందా రైల్వేలైను పథకం హైదరాబాదు నుంచి వాడివరకు అప్పటికే ఉండిన రైల్వేలైనును ఒక బ్రిటిషు కంపెనీకి అప్పగించాలని నిర్ణయించింది. ఆ కంపెనీ బ్రిటనులో పెట్టుబడులు సేకరించి, రైల్వేలైనును వరంగలు మీదుగా సింగరేణిగనులవరకు ఒక లైను, చాందావరకు మరొక లైను పొడిగించాలని, ఈ బ్రిటిషు పెట్టుబడులపై కచ్చితమైన లాభాలకు నిజాంప్రభుత్వం హామీ ఇవ్వాలని, దాన్ని "నిజాం గ్యారంటీడ్ స్టేట్ రైల్వే" అని పిలవాలని ఈ పథకం ఉద్దేశించింది. ఇది హైదరాబాదురాష్ట్రప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమని హైదరాబాదు కాలేజి (ఆ తర్వాత నిజాం కాలేజి) ప్రిన్సిపాలు అఘోరనాథ ఛటోపాధ్యాయ, నిజాంప్రభుత్వ అధికారి ముల్లా అబ్దుల్ ఖయ్యూంల నాయకత్వాన ప్రజల వ్యతిరేకత సాగింది. అప్పటికే ఏర్పడి ఉన్న 'అంజుమన్-ఎ-ఇక్వాన్-ఉస్-సఫా' (సోదర సమితి) అనే సంస్థ ఈ వ్యతిరేకతను ప్రారంభించగా, కొత్తగా చాందా రైల్వే స్కీం వ్యవహారాల కమిటీ అనే ప్రజా సంఘం కూడ ఏర్పాటయింది. ప్రభుత్వం అమలుచేయదలచుకున్న పథకపు పూర్తివివరాలను ప్రజలముందు ఉంచాలని కోరింది. ఒక రాచరిక ప్రభుత్వ కాలంలో ప్రభుత్వవిధానాన్ని బహిరంగపరచాలని కోరడం ఎంత ప్రగతిశీల ఆలోచనో చెప్పనక్కరలేదు. ఈ ఉద్యమానికి నాయకత్వం వహించినందుకు అఘోరనాథ ఛటోపాధ్యాయను రాజ్యంనుంచి బహిష్కరించి, రైల్వే స్కీంను ప్రభుత్వం అనుకున్నట్టే అమలుచేసినప్పటికీ ఈ ఉద్యమం ఒక రకంగా విదేశీ జోక్యాన్నీ పెట్టుబడులనూ వ్యతిరేకించడానికి, స్వదేశీవిధానం అమలు కావాలనడానికి తొలి అడుగు.

చాందా రైల్వే స్కీం పట్ల వ్యతిరేకతకు ముందే 1879లోనే యంగ్‌మెన్స్ ఇంప్రూవ్‌మెంట్ అసోసియేషన్, తర్వాత 1882లో థియొసాఫికల్ సొసైటీ



ఏర్పడ్డాయి. సికిందరాబాదులో ఆల్బర్ట్ రీడింగ్ రూం, హైదరాబాదులో మాల్వాలా సభ, చాదర్ ఘాట్ లో హిందూ సోషల్ క్లబ్ వంటి ప్రజాసంస్థలు పనిచేయడం మొదలయింది. అప్పటికే పనిచేస్తున్న ఇంగ్లీషు, ఉర్దూ పత్రికలు ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, ప్రజాప్రయోజనాలను ప్రకటిస్తూ వ్యాసాలు, వార్తలు ప్రచురిస్తుండగా బ్రిటిష్ రెసిడెన్సీ, నిజాంప్రభుత్వం రెండూ కూడ పత్రికలమీద ఆంక్షలు విధించడం ప్రారంభించాయి. భారత జాతీయ కాంగ్రెసు ఆవిర్భావాన్ని సమర్థిస్తూ హైదరాబాదు పత్రికలలో వ్యాసాలు వెలువడ్డాయి. భారత జాతీయ కాంగ్రెసును పరిచయంచేసే సభలు 1888లో సికిందరాబాదులోనూ, చాదర్‌ఘాట్‌లోనూ జరిగాయి. సికిందరాబాదు హెడ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా షామియానావేసి జరిపిన సభకు రెండువేలమంది హాజరయ్యారని ఆనాటి పత్రికలు రాశాయి. ఆర్య సమాజం స్థాపన (1892), స్వామి వివేకానంద పర్యటన (1893), హైదరాబాద్ రాజ్యంలోని మరాఠీ భాషీయులద్వారా బాల గంగాధర తిలక్ ప్రభావం, 1895 నుంచీ పెద్దఎత్తున గణేశ ఉత్సవాలు జరపడంవంటి పరిణామాలు అనంతరకాలంలో మతతత్వానికి దారితీసినప్పటికీ, అప్పటికి మాత్రం ప్రజాసమీకరణకు, సంఘటితకృషికి వీలు కల్పించాయి. హైదరాబాదు రాజ్యంలో మొదటి మరాఠీ గ్రంథాలయంగా 'షా అలి బండ'లో 'భారత గుణవర్ధక సంస్థ' 1895లో ఏర్పడింది. మొదటి తెలుగు గ్రంథాలయంగా సుల్తానుబజారులో 'శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రగ్రంథాలయం' 1901 ఏర్పడింది. హనుమకొండలో 'శ్రీ రాజరాజ నరేంద్రాంధ్ర గ్రంథాలయం' (1904)తో సహా రాజ్యమంతటా అనేక గ్రంథాలయాలు ఏర్పడ్డాయి. హైదరాబాదులో మొదటి బాలికల పాఠశాలను 1904లో కాళోజీ రంగారావు ప్రారంభించారు. దళితులను ఆదిహిందువులుగా ప్రకటిస్తూ, వారిఅభ్యున్నతికోసం భాగ్యరెడ్డి వర్మ స్థాపించిన స్వచ్ఛంద సంస్థ 'జగన్ మిత్రమండలి' 1906లో ఏర్పడింది. హ్యూమానిటేరియన్ లీగ్ (1913), సోషల్ సర్వీస్ లీగ్ (1915), ఆదిహిందూ సమాజం, వర్తక సంఘాలు, విభిన్న కులసంఘాలు ఏర్పడి పనిచేయడం ప్రారంభించాయి. హైదరాబాదులో 1915లో మొదలయిన హైదరాబాదు విద్యామహాసభలు, ఆ తర్వాత ఐదు సంవత్సరాల పాటు ప్రతి సంవత్సరం జరిగాయి. దేశవ్యాప్తంగా హిందూ-ముస్లిం ఐక్యతకు, ప్రజాచైతన్యవ్యాప్తికి చిహ్నంగా నిలిచిన ఖిలాఫత్ ఉద్యమం (1920-21) హైదరాబాదులో కూడ ఉధృతంగానే సాగింది. ఆంధ్రజన సంఘం, ఆంధ్రజన కేంద్ర సంఘం, హైదరాబాద్ స్టేట్ పొలిటికల్ రిఫార్మ్స్ అసోసియేషన్, హోమ్‌రూల్ లీగ్, అంజుమన్ తరక్కీ, ఇత్తెహాదుల్ ముసల్మీన్, అంజుమన్-ఎ-తబ్లీగ్-ఎ-ఇస్లాం, అంజుమన్-ఎ-ఖాక్సరన్, ఆర్య రక్షణ సమితి, శుద్ధి ప్రచార్, హిందూ పౌరసమితి, సేవాదళ్, నిజాంరాష్ట్ర మహారాష్ట్ర పరిషత్, కర్ణాటక పరిషత్, ఆంధ్ర మహాసభ,

కామ్రేడ్స్ అసోసియేషన్, హైదరాబాద్ సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ మొదలైన సంస్థల ఏర్పాటువంటి ఎన్నో పరిణామాలు 1920, 30 దశకాలలో సాగాయి. ఈ సాంఘిక, సాంస్కృతిక, మత, రాజకీయ నిర్మాణాలలో కొందరు జాగీర్దార్లనుంచి దళితులదాకా, హైదరాబాదునగర పౌరులనుంచి మారుమూల గ్రామాల ప్రజలదాకా, హిందూ ముస్లిం భేదంలేకుండా ఎందరెందరో పాల్గొన్నారు. ఈ అన్ని ప్రజాసంఘటిత నిర్మాణాలు హైదరాబాదురాజ్యప్రజలలో చైతన్యం రగిలించి పోరాటాలకు సిద్ధం చేశాయి. శిక్షణ ఇచ్చాయి. అలా 1930ల నాటికి హైదరాబాదులో విస్తృతమైన ప్రజారాజకీయ రంగస్థలం సిద్ధమై ఉంది.

ఈ విశాల ప్రజారాజకీయాల చిత్రంలో ఒకానొక రంగు దిద్దినది హైదరాబాదు స్టేట్ కాంగ్రెసు. భారత జాతీయ కాంగ్రెసు ఏర్పడిన తొలిదినాలలోనే హైదరాబాదురాజ్యానికి చెందిన కొందరువ్యక్తులు దాని సమావేశాలలో పాల్గొన్నారు, దాన్ని సమర్థిస్తూ హైదరాబాదు పత్రికలలో రాశారు, సమావేశాలు ఏర్పాటు చేశారు. 1910లు వచ్చేసరికి ఈ భాగస్వామ్యం మరింతపెరిగి ఆ దశాబ్దం చివరినాటికి హైదరాబాదులో భారత జాతీయ కాంగ్రెసు శాఖను ఏర్పాటు చేసే ప్రయత్నం కూడ జరిగింది. అయితే అప్పటికి భారత జాతీయ కాంగ్రెసుకే బ్రిటిషు ఇండియాకు బయట, స్వతంత్ర సంస్థానాలలో పోరాటాలు ప్రారంభించవచ్చునా లేదా స్పష్టత లేదు.

ఈ దశలో హైదరాబాదురాజ్యంలోని కాంగ్రెసు అభిమానులకు అనుకోని అవకాశం ఒకటి వచ్చింది. బెంగాల్ - నాగపూర్ రైల్వే మార్గానికి గండ్లుపడడంవల్ల 1923 డిసెంబరులో కాకినాడలో జరిగిన భారత జాతీయ కాంగ్రెసు 38వ సమావేశ ప్రతినిధులు సికిందరాబాదుమీదుగా వెళ్లవలసి వచ్చింది. ఆ ప్రతినిధులకు సికిందరాబాదులోనూ, దారిలో రైల్వేస్టేషన్లలోను స్వాగతసత్కారాలు లభించాయి. భారత జాతీయ కాంగ్రెసు నాయకులు హైదరాబాదురాజ్యప్రజలను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం వచ్చింది. హైదరాబాదునుంచి కనీసం ఐదువందలమంది కాకినాడ మహాసభలకు వెళ్లారనీ, వారిలో ఇరవైఐదుమందిని ప్రతినిధులుగా తీసుకున్నారనీ ఆధారాలు ఉన్నాయి. అప్పటికే సరోజినీ నాయుడుకు కేంద్ర నాయకత్వంతో ఉన్న సన్నిహితసంబంధాలవల్ల హైదరాబాదు ప్రతినిధివర్గానికి కాకినాడలో చాల ప్రాముఖ్యత కూడ దొరికింది. తీర్మానాలను హిందీ-తెలుగు-ఉర్దూ-ఇంగ్లీషులలో ఒకభాషనుంచి మరొకభాషకు అనువాదం చేయడంలో హైదరాబాదు ప్రతినిధి బూర్గుల రామకృష్ణారావు ప్రతిభకనబరచి జాతీయ నాయకుల ఆదరాన్నిపొందారని కూడ సమకాలీన ఆధారాలు చెపుతున్నాయి. కాకినాడకు వెళ్లిన హైదరాబాదు ప్రతినిధులు అక్కడ విడిగా సమావేశమయి



హైదరాబాదురాజ్య రాజకీయపరిస్థితులగురించి చర్చించుకున్నారు. ఆ సమావేశాన్ని 'మొట్టమొదటి హైదరాబాదు రాజకీయ సమ్మేళనం' అని పిలుచుకున్నారు. ఈ రాజకీయ సమ్మేళనాలు ఆ తర్వాత కూడ జరిగాయి.

కాకినాడలో జరిగిన హైదరాబాదు మొదటి రాజకీయ సమ్మేళనానికి నాలుగు సంవత్సరాలకు ముందుగానే హైదరాబాదురాజ్యంలో పాలనా సంస్కరణలు ప్రవేశపెట్టే ఉద్దేశ్యం ఉందని ప్రభువు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ప్రకటించి ఉన్నాడు. అంటే ఒక ప్రజారాజకీయ పార్టీ ఏర్పడడానికి రంగం సిద్ధమవుతుండింది. హైదరాబాదురాజ్యంలో కాంగ్రెసు నిర్మాణం పూర్తిస్థాయిలో ఏర్పడడానికి వాతావరణం అనుకూలంగా ఉండింది. కాని ఆ పని తొలిదశకు చేరడానికి 1938 దాకా ఆగవలసి వచ్చింది. అప్పుడు కూడ హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ సమావేశం ప్రకటించగానే ప్రభుత్వం ఆంక్షలు విధించింది. పేరును బట్టి చూస్తే ఈ సంస్థకు రాజ్యంబయటి (బ్రిటిషు ఇండియాలోని భారత జాతీయ కాంగ్రెసు వంటి) సంస్థలతో సంబంధం ఉన్నదని అనుమానం కలుగుతున్నదని ప్రభుత్వం వాదించింది. నాటి హైదరాబాదు కాంగ్రెసు నాయకులు తమకు అటువంటి సంబంధంలేదని ప్రకటించారు. ఒకదశలో పేరుమార్చుకోవడానికి కూడ సిద్ధపడ్డారు. అయినా ప్రభుత్వం ఈ సంస్థను అనుమానంగానే చూసింది. ఆ అనుమానానికి రాజకీయకారణాలూ ఉన్నాయి, మతపరమైన కారణాలూ ఉన్నాయి. ఏమయినా ఒక తాత్కాలిక కార్యనిర్వాహకవర్గం కూడ ఏర్పాటయి, విస్తృత సమావేశం ఏర్పాటు చేయనున్న సమయంలో ప్రభుత్వం సంస్థమీద విరుచుకుపడింది. సంస్థ పెట్టుకునే తమహక్కుకోసం సత్యాగ్రహం చేయాలని స్టేట్ కాంగ్రెస్ నిర్ణయించింది. ఆ సత్యాగ్రహబృందాలను అరెస్టుచేసి జైలుపాలు చేయడం మొదలయిన తర్వాత, అప్పుడే హిందూమతసంస్థల సత్యాగ్రహం కూడ సాగుతున్నందువల్ల కాంగ్రెసు సత్యాగ్రహంమీద అనుమానాలువచ్చే అవకాశం ఉందంటూ, విరమించుకొమ్మంటూ స్వయంగా గాంధీ, నెహ్రూలు సలహా ఇచ్చారు. అందుకు కొన్ని సంవత్సరాలముందే హరిపురా సమావేశంలో సంస్థానాలలో ప్రజారాజకీయ ఆకాంక్షలకు మద్దతు ఇస్తూనే, సంస్థానాలలో ప్రత్యక్షంగా పాల్గొనలేమని భారత జాతీయ కాంగ్రెసు తీసుకున్న వైఖరికి ఇది కొనసాగింపే. మొత్తంమీద 1938లో స్టేట్ కాంగ్రెసు తన సత్యాగ్రహ కార్యక్రమాన్ని విరమించుకోవలసి వచ్చింది. ఈ చరిత్రనంతా ఈ కరపత్రమూ, అనుబంధాలూ వివరిస్తాయి.

ఆతర్వాత కూడ ఆరు సంవత్సరాలకుపైగా అటు భారత జాతీయ కాంగ్రెసు నాయకత్వానికీ నిజాం ప్రభుత్వానికీ మధ్య, ఇటు హైదరాబాదు స్టేట్ కాంగ్రెసు

నాయకత్వానికీ నిజాం ప్రభుత్వానికీ మధ్య ఎడతెగని చర్చలు, ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయి. అందులో స్టేట్ కాంగ్రెసు నాయకుల వైఖరులలోనే భిన్నమైన దృక్పథాలు కనబడతాయి. నిషేధంవల్ల బహిరంగకార్యక్రమాలు నిర్వహించే అవకాశం లేకపోయినా, నాటి స్టేట్ కాంగ్రెసు నాయకులు ఆంధ్ర మహాసభ, మహారాష్ట్ర పరిషత్, కర్ణాటక పరిషత్ వంటి సంస్థలలో పనిచేశారు. 1944 మేలో బోనగిరి పదకొండవ ఆంధ్ర మహాసభలో చీలిక వచ్చినప్పుడు స్టేట్ కాంగ్రెస్ నాయకులలో కొద్దిమంది మినహా మిగతా వారందరూ 'జాతీయ వర్గం'గా మారారు. ఆనాటి ప్రధాన పాత్రధారులైన కాశీనాథరావు వైద్య, గోవిందరావు నానల్, బూర్గుల రామకృష్ణరావు వంటివారు ఆత్మకథలు, అనుభవాలు రాయలేదు గాని స్వామీ రామానంద తీర్థ, మందుముల నరసింగరావు, రావి నారాయణ రెడ్డి వంటి ప్రముఖుల ఆత్మకథలలోను, చరిత్ర పరిశోధకుల పుస్తకాలలోను ఈ పరిణామాలన్నీ నమోదయ్యాయి. చివరికి 1946 ఏప్రిల్‌లో ప్రభుత్వం అధికారికంగా హైదరాబాద్ స్టేట్ కాంగ్రెసు మీద నిషేధం తొలగించింది. ఆరు సంవత్సరాల తర్వాత హైదరాబాదు రాష్ట్రంలో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెసు అధికారానికి కూడ వచ్చింది.

ఈ చారిత్రక నేపథ్యానికి ముగింపుగా ఒక మాట చెప్పాలి. హైదరాబాదు రాజ్యచరిత్రలో అధికారానికి, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఎన్నో దశాబ్దాల పాటు వేరువేరురూపాలలో సాగించిన పోరాటాలకు ఒక రాజకీయనిర్మాణరూపం ఇచ్చే సమయం, అవకాశం వచ్చినప్పుడు కాంగ్రెసు నాయకత్వం శషభిషలులేని నిర్మాణాత్మకవైఖరిని తీసుకోలేకపోయింది. ప్రజల కోరికను మన్నించి వారి ఉద్యమానికి ఒక సంస్థాగతరూపం ఇవ్వడానికి స్థానిక నాయకత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, స్వయంగా గాంధీతో సహా 'జాతీయ' నాయకత్వం వెనుకడుగు వేసింది. అలాగే ప్రజలు ఆంధ్ర మహాసభ కింద సంఘటితమై, వెట్టిచాకిరీ రద్దు, భూసంబంధాల మార్పు, అట్టడుగువర్గాల అభ్యున్నతి వంటి తమ మౌలిక ఆకాంక్షలను ప్రకటించడం మొదలుపెట్టినప్పుడు కాంగ్రెసు నాయకత్వం ఆ ఆకాంక్షలకు తాను దూరమని చాటుకుంది. ప్రజలు పోరాటానికి సిద్ధంగా ఉండి నాయకత్వం వహించమని పిలిచినప్పుడు కాంగ్రెసు ఇలా దూరం కాగా, కమ్యూనిస్టు పార్టీ ఆ స్థానాన్ని భర్తీ చేసింది. అలా 1938లోనూ, 1944లోనూ కాంగ్రెసు అనుసరించిన వైఖరే, హైదరాబాదు రాజ్యంలో, ప్రత్యేకించి తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీ బలపడడానికి ఒక కారణమయింది. మళ్లీ కొద్ది కాలంలోనే కాంగ్రెసు ప్రాబల్యం పొందడానికి, కమ్యూనిస్టుపార్టీ క్రమక్రమంగా వెనుకపట్టు పట్టడానికి కారణాలు ఇక్కడ అప్రస్తుతం. కాని 1921 నుంచి 1938 దాకా హైదరాబాదురాజ్యంలో జరిగిన పరిణామాలలో ఒక పార్శ్వాన్ని పరామర్శించే



ఈ ఉత్తేజభరితమైన, అద్భుత గతిశీలమైన చరిత్రనుంచి ఇవాళ్టికి కూడ నేర్చుకోవలసిన పాఠాలెన్నో ఉన్నాయి.

**ఉపయుక్త గ్రంథాలు:**

ఈ ముందుమాట, వివరణలు రాయడంలో ఆనాటి చరిత్రకు సంబంధించిన ఎన్నో గ్రంథాలు; భాగస్వాములూ పరిశోధకులూ అధికారికసంస్థలూ ప్రకటించిన పుస్తకాలు ఉపయోగపడ్డాయి. ఆసక్తిగల పాఠకులు మరిన్ని వివరాల కోసం ఆ పుస్తకాలను సంప్రదించడానికి వీలుగా జాబితా ఇస్తున్నాను:

ఎం.బి. గౌతమ్ (2009) - భాగ్యోదయం - భాగ్యరెడ్డివర్మ జీవితాదర్శం - ఆచరణ, సమాంతర ప్రచురణలు, హైదరాబాదు

కె. జితేంద్రబాబు (2009) - నిజాం రాష్ట్రాంధ్ర మహాసభలు - మొదటి భాగం, రెండవ భాగం, తెలంగాణ జాగృతి, హైదరాబాదు

టి. ఉడయవర్లు (2006) - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనిర్మాత బూర్గుల రామకృష్ణరావు - స్పృహ సాహితీసంస్థ, హైదరాబాదు

పెండ్యాల రాఘవరావు (2007) - నా ప్రజాజీవితం - రాఘవరావు కుటుంబ సభ్యులు, హైదరాబాదు

మందుముల నరసింగరావు (1977) - 50 సంవత్సరాల హైదరాబాదు - మందుముల నరసింగరావు స్మారకసమితి, హైదరాబాదు

రావి నారాయణరెడ్డి (1992) - నా జీవనపథంలో..., మూసీ పబ్లికేషన్స్, హైదరాబాదు

వెల్దుర్తి మాణిక్యరావు (1984) - హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమ చరిత్ర - స్వాతంత్ర్య సమరయోధుల సంఘం, హైదరాబాదు

స్వామీ రామానంద తీర్థ (1984) - హైదరాబాద్ స్వాతంత్ర్య పోరాటం - స్వామీ రామానంద తీర్థ స్మారక సంఘం, హైదరాబాదు

సురవరం ప్రతాపరెడ్డి (1989) - గోల్కొండ పత్రిక సంపాదకీయాలు - సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి, హైదరాబాదు

Bawa, V K (1993) – The Last Nizam – The Life & Times of Mir Osman Ali Khan, Penguin Books, New Delhi.

Benichou Lucien D (2000) – From Autocracy to Integration : Political Developments in Hyderabad State (1938-1948), Orient Longman, Hyderabad.

Prasad, Rajendra (2010) – Asif Jahs of Hyderabad – Their Rise and Decline – Prachee Publications, Hyderabad.

Raj, Sheela (2002) – The Legacy of the Nizams – HEH The Nizam''s Urdu Trust, Hyderabad.

Ramesan, N (ed) (1966) – The Freedom Struggle in Hyderabad, Vol. II (1857-1885), Vol. III (1885-1920), Vol. IV (1921-1947) – The Andhra Pradesh State Committee Appointed for the Compilation of a History of the Freedom Struggle in Andhra Pradesh

Vaikuntham, Y (ed) (2004) – People's Movements in the Princely States, Manohar, Delhi.

# హైదరాబాదు - స్టేటు కాంగ్రెసు

## ఉత్పత్తి - అభివృద్ధి

### గొప్ప వాగ్దానము

ఇప్పటికి సుమారు 20 సంవత్సరముల క్రిందట 1338 హిజరి జమాదిలవ్వల్ 13వ తేదీని[1] (4 ఫిబ్రవరి 1927) మహా ఘనత వహించిన[2] నిజాము ప్రభువు అప్పుడు ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గమునకు[3] అధ్యక్షులుగానున్న సర్ అలీ ఇమామును[4] శాసనసభ[5] సంస్కరణార్థమై వెంటనే తగినఉపకరణములు తయారుచేయవలసినదిగా ఒక ఫర్మానును[6] దయచేసి యుండిరి. ఆ ఫర్మానునందు శాసనసభలో ఎన్నికలద్వారా గెలుపొందిన సభ్యులు ఎక్కువ వుండవలెననిన్నీ, ఎన్నికలు ప్రత్యక్షపద్ధతి (Direct franchise) గా జరుగవలెననిన్నీ, అల్పసంఖ్యాకులకు (Minorities) తగిన హక్కుల సంరక్షణలుండవలెననిన్నీ, అందుకు వలయు హంశములనన్నింటినీ సంపాదించవలెననిన్నీ, ఒక నివేదికను తయారు చేయించవలెననిన్నీ రిటైర్డు హైకోర్టు జడ్జి రాయ్ బాలముకుందు[7]కు ఆజ్ఞాపించిరి. సదరు నివేదిక ఆతర్వాత 18 మాసములకు వెలువడెను. ఆ నివేదికయందు మింటో-మార్లే సంస్కరణములను[8] అనుసరించి శాసనసభాసంస్కరణములు సూచింపబడినవని తెలియవచ్చెను.

బ్రిటిష్ ఇండియాయందు మాంటేగ్యు-ఛెమ్సుఫర్డు సంస్కరణములు[9] అమలులోకివచ్చి ప్రజాజీవనమునందు అభివృద్ధి ఎక్కువగా కలుగుచున్నందువలన 1920 సం॥లో తయారు కాబడిన పరికరములను, నివేదికను ఆధారపరుచుకొని ప్రత్యేకపు నూతనప్రణాళికను సిద్ధపరుచుటకు వేరొకసంఘమును[10] ప్రభుత్వమువారు ఏర్పాటుచేసిరి. ఈ సంఘ నివేదిక, బాలముకుందు నివేదిక అమలుచేయబడక ప్రభుత్వవైఖరియందు మౌనమేర్పడి యుండుటచే హైదరాబాదు స్టేటు రాజకీయ సంస్కరణ సంఘము[11] (హైదరాబాదు స్టేటు రిఫార్మ్సు అసోసియేషన్) తర్వాత కొంతకాలమునకే రాచకీయసంస్కరణల అధిక ఆవశ్యకతను సూచించుటకు ఒక సభను జరుపప్రయత్నించినది. కాని అట్టి సభను జరుపుటకు ప్రభుత్వమువా రనుజ్ఞ నొసగలేదు.

## ప్రభుత్వ గమన నిరోధము

ఇంతేకాక రాజకీయసమస్యలను, రాజకీయసమావేశములను నిరోధించు ఒక ఫర్మానును[12] ప్రభుత్వమువారు ప్రజలకు ప్రసాదించిరి. రాజకీయపరిస్థితులను గమనించి హైదరాబాదు స్టేటు రిఫార్మ్ అసోసియేషన్ శాసనసభాసంస్కరణము కొరకు ఒక నిశ్చితప్రణాళికను సిద్ధపరచి ప్రభుత్వ కార్యనిర్వాహకవర్గమునకు రాయబారము నంపి వారి ప్రణాళికను శీఘ్రముగా అనుసరించవలెనని కోరి యుండిరి.

## వాక్స్వాతంత్ర్యభంగము

ఈ రాయబారపు ప్రణాళిక ననుసరించకపోగా మీదు మిక్కిలి "కాలీగస్తీ" 53 నొకదానిని ప్రచురించి ప్రజాసమావేశములను, సభలను జరుపుటకు వీలు లేకుండ జేసిరి. ఈ ఫర్మాను విషయమై ప్రజలలో తీవ్రమగు సంచలన మేర్పడెను. వాక్స్వాతంత్ర్యబంధనము కష్టతరమని ప్రజలు గ్రహించి గస్తీని, రద్దుచేయ పాటుపడు కమిటీ[13] యొకటి యేర్పరచిరి. ఈ కమిటీ తరపున ప్రభుత్వము వద్దకు ప్రజాభిప్రాయమును వ్యక్తపరచుటకు రాయబారము వెడలెను. వారి ప్రయత్నములు వ్యర్థములగుటచే హైదరాబాదు జిల్లా కాంగ్రెస్ కమిటీవారు[14] మౌల్వీ సిరాజుల్ హసన్‌తిర్మిజీ సా[15]. నాయకత్వమున ప్రభుత్వమువారికి విషయములన్నియు సమగ్రముగా నివేదించిరి. ఈ తిర్మిజీ సా. విజ్ఞప్తి విఫలము అగుటయేగాక జిల్లా కాంగ్రెస్ కమిటీవారు యిట్టిప్రచారమునందు పాల్గొను టుచితమా అనుచితమాయని పలువురు వాగ్వాదములు జరిపిరి.

## ఇతరాందోళనలు

ఈ విధముగా ప్రజాందోళనము ఎక్కువ అయ్యెను. అకోలా[16] (మధ్య రాష్ట్రములు) యందు హైదరాబాదు స్టేటు రాజకీయ మహాసభాసమావేశము జరిగెను. బాధ్యతాయుతప్రభుత్వము[17] పరమావధి యనియు, రాజ్యాంగ సంస్కరణములను త్వరలో ప్రవేశపెట్టవలెననియు తీర్మానము గావింపబడెను. ప్రభుత్వమువారు తీర్మానమును గమనించలేదు. హైదరాబాదు రాజకీయ మహాసభాస్థాయిసంఘమువారు శ్రీ నిజాము ప్రభువు రజితోత్సవ సందర్భమున శాసనసభాసంస్కరణము చాల అవసరమని తెలియజేయుచు, యొక విన్నపమును పంపుకొనిరి. ఆ సమయముననే శాసనసభ్యులగు శ్రీ కె.యస్. వైద్యా[18] అప్పుడు అమలులోనున్న రాజ్యాంగశాసనములను సంస్కరింపవలెనని కోరుచు యొక తీర్మానమును ప్రవేశపెట్టుటకు అనుమతిని కోరిరి.



## ఫెళఫెళార్భాటాలు

1931-32 సం॥లో మహాత్మాగాంధీ నాయకత్వమున భరతఖండమున మహత్తరమైన రాచకీయఆందోళన జరిగెను. దాని ప్రతిఫలములు హైదరాబాదులో కూడ ప్రతిబింబితము లగుచుండెను. అనేకమంది హైదరాబాదు స్వచ్ఛందసేవకులు వేరువేరు రాష్ట్రములలో జరిగిన సత్యాగ్రహసమరములో పాల్గొని కారాగృహముల బంధింపబడిరి. స్థానికముగా ఖాదీప్రచారము చాలవరకు జరిగెను. స్వదేశీ లీగు[19] అను పేరుతో విదేశవస్తుబహిష్కరణము కొంతవరకు జరిగెను. తత్ఫలితముగా సిటీ కాలేజీలో[20] ప్రొఫెసరుగాయున్న మౌల్వీ ఫజులు రహెమాన్ సా.[21] ఉద్యోగము కూడ పోగొట్టుకొనిరి.

జిల్లా కాంగ్రెసువారి యాజమాన్యమున గవర్నమెంటువారి సలహాకు వ్యతిరేకముగా మోతీలాల్ దినము[22] కూడ జరుపబడెను. పతాక వందనోత్సవము ప్రతివారము జరుగుట ఆచారముగా వచ్చుచుండెను. 144 సెక్షను ప్రయోగించి నప్పటికి దానిని ధిక్కరించుచూ నవజవాన్ సభవారు[23] మోతీలాల్ స్మారక దినమును జరిపిరి. ఇవి అన్నియు ప్రజలలో నూతనభావోదయమును కల్పించి భావి పురోభివృద్ధికి కారణము లయ్యెను.

## మరొక అభినయము

రాజకీయస్థితిగతులు యీ విధమున పరిణామముపొందుచుండగా సర్ అక్బర్ హైదరీ[24] ప్రత్యేక శాసనసభా సమావేశమును గావించి, అందు మహా ఘనత వహించిన శ్రీ నిజాము ప్రభువు 22వ సెప్టెంబరు 1937న (17వ ఆబాన్ 1346 ఫసలీ) దివాను బహాదుర్ ఆరావముదు అయ్యంగారు కమిటీ[25] నియామకమును ప్రకటించిరి. ఆ కమిటివారు వివిధవిషయములను విచారించి ప్రజలకును ప్రభుత్వమునకును ఎక్కువ సంబంధముతో రాజకీయాభివృద్ధిని ఎంతవరకు పెంపొందించుటకు వీలగునో సూచించుచు, ప్రజాభిప్రాయము లను, అభిమతములను అనుదినమును తెలిసికొనుటకు వీలగు రాజకీయ విధానమును నివేదించెదరని ప్రకటించిరి. ఈ కమిటీ యేర్పరుపబడినప్పటికి నిజాం ప్రభుత్వప్రకటన ఆశాజనకముగా యుండలేదు. కమిటీయొక్క కార్యక్రమము, విచారణావిధానము అసంతృప్తికరములుగ నుండెను. బాధ్యతాయుతప్రభుత్వమునుగురించి సదరు ప్రకటనలో సూచనయే లేకపోయెను. ప్రకటనస్వభావ మెటులున్నను 1938 మార్చి లోపుగా రాజ్యాంగ సంస్కరణములను ప్రవేశపెట్టుటకు ప్రయత్నములన్నియు పూర్తి కావలయునని శ్రీ నిజాం అభిలాష పై ఫర్మానునందు వ్యక్తమైనప్పటికి, రాజ్యాంగసంస్కరణ విచారణగాని, నివేదికగాని సకాలమున సంపూర్తి కాలేదు. ప్రభుత్వమువారు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=446**